తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# కన్నులపండువగా రథోత్సవం



తిరుచానూరు, నవంబర్ 27 ప్రభాతవార్త:
తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో 8వ రోజు ఆదివారం ఉదయం రథోత్సవం కన్నులపండువగా జరిగింది. ఉదయం 7-10 గంటలకు రథోత్సవం మొదలై ఆలయ నాలుగు మాడవీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. సర్వాలంకార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలుమంగ సకలదేవతా పరివారంతో వైభవోపేతంగా తిరువీధులలో విహరించే వేళలో ఆ తల్లిని సేవించిన.. భక్తుల కోరికలు సిద్ధిస్తాయని విశ్వాసం. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి రథమండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, పన్నీరు వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి విశేషంగా అలంకారం చేశారు. కాగా సాయంత్రం 5-30 నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది.

## -నేడు వైభవంగా పంచమితీర్థం



## రాత్రి కల్కి అవతారంలో అశ్వవాహనంపై అమ్మవారు సాక్షాత్కారం



రాత్రి 7 నుండి 9 గంటల వరకు అశ్వవాహనంపై కల్కి అవతారంలో అమ్మవారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా.. భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, కర్పూర హారతులు, గోవింద నామస్మరణలతో అడుగడుగునా అమ్మవారికి భక్తులు బ్రహ్మరథం పట్టారు. నేడు అత్యంత ముఖ్యమైన ఘట్టం పంచమితీర్థం వైభవంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్, చిన్నజీయర్ స్వాములు, టిటిడి ఈఓ ధర్మారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖ్‌కుమార్, సిఈ నాగేశ్వరరావు, ఎస్‌ఈ సత్యనారయణ, ఈఈలు మనోహర్, నరసింహమూర్తి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు బాబుస్వామి, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ దాము పాల్గొన్నారు.

# డిసెంబర్ 16నుంచి సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై

తిరుమల, నవంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:
ధనుర్మాసం ఆరంభ సందర్భంగా తిరుమలేశుని ఆలయంలో డిసెంబర్ 16వతేదీ నుంచి జనవరి 15వరకు తిరుప్పావై ప్రవచనాలు పఠిస్తారు. ఆనెలరోజులు వెంకన్న ఆలయంలో గోదాదేవి రచించిన తిరుప్పావై ప్రవచనాలతోనే గోవిందుడిని ఆలయ అర్చకులు, పరిచారికలు మేల్కొలుపుతారు. రోజుకో పాశురం వంతున 30 రోజులు పాటు ఈ పాశురాల పఠిస్తూ మేల్కొలుపుతారు. ఏడాదిలో తిరుమల ఆలయంలో నెలరోజులు తప్ప మిగిలిన రోజుల్లో సుప్రభాతసేవ జరుగుతుంది.




### రాష్ట్రపతి తిరుపతి జిల్లా పర్యటన నేపథ్యంలో

# ఐఐటి ప్రాంగణం కలెక్టర్ పరిశీలన



ఏర్పేడు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 27 ప్రభాతవార్త
భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము డిసెంబర్ 5న తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారు. తిరుమలేశుని దర్శనంతో పాటు ఇతర కార్యక్రమాల్లో అమె పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఒక వేళ ఏర్పేడు మండల కేంద్రంలోని ఐఐటిలో పెండింగ్‌లో ఉన్న విద్యాసంస్థను జాతికి అంకితం చేసే కార్యక్రమాల ఏర్పాటులో రెవెన్యూ, పోలీసు అధికారులు పలు పరిశీలనలు జరిపారు. భారత రాష్ట్రపతి డిసెంబర్ నెలలో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని దర్శించుకొనుటకు రానున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాల్లో బాగంగా ఏర్పేడు ఐఐటిలో పర్యటించుటకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలనుకుంటే ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పరిశీలనలు జరిపారు. ఐఐటి ప్రాంగణాన్ని పరిసరాలను వారు పరిశీలించారు. కాగా డైరెక్టర్ తమ సిబ్బందికి ఆదేశాలు జారి చేసారు. ఒక వేళ రాష్ట్ర పతి వస్తే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. అయితే ఆమె పర్యటన ఇక్కడ ఖరారు కాలేదు. కానీ అధికారులు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భద్రతా పరమైన అంశాల గురించి జిల్లా కలెక్టర్ ఆరా తీసారు. పర్యటనలో ఎటువంటి లోటు లేకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనల్లో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, అదనపు కలెక్టర్ బాలాజి, ఎస్‌బి డిఎస్‌పి సురేంద్రరెడ్డి, రేణిగుంట డిఎస్‌పి రామచంద్ర తదితరులు పరిశీలించారు.

# పల్లెల్లో మంచు దుప్పటి

### - పొలాలకు తెగుళ్ల ముప్పు



పంట పొలాలపై పరుచుకున్న మంచు

తడ, నవంబర్ 27 ప్రభాతవార్త
తడ మండలంలోని పల్లెల్లో గత నాలుగురోజులుగా మంచుదుప్పటి పరుచుకుంటోంది. విపరీతమైన పొగమంచు కారణంగా వరిపంటకు తెగుళ్ల వ్యాపిస్తాయని రైతన్నలు భయపడుతున్నారు. వృద్ధులు, మహిళలు మంచుబారిన పడి రోగాల బారిన పడుతున్నారు. తెల్లవారుజాము నుంచే విపరీతమైన చలితో ఈ మంచు వాతావరణం భయపెడుతోంది. పగటిపూట ఒకవైపు ఎండ కాస్తున్నప్పటికీ మరో వైపు మంచు ప్రభావం కారణంగా బయటికి రావాలంటే జనం భయపడుతున్నారు. మరిన్ని రోజులు ఇదే వాతావరణం కొనసాగితే పల్లెజనం మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని అంటున్నారు. మొత్తంమీద ఇది శీతాకాలం ప్రభావం కావడం వల్ల క్రమేణా మంచు కనిపించకుండా పోతుందని కూడా నమ్ముతున్నారు.


# ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం!



దొరవారిసత్రం ఆరోగ్య కేంద్రం

### - రోగులకు అందని సరైన వైద్యం
### - గతంలో ఎన్నో రివార్డులు.. నేడు ఎన్నో ఫిర్యాదులు

దొరవారిసత్రం, నవంబర్ 27 ప్రభాతవార్త
దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం చేసింది. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న సామెత ఆరోగ్య కేంద్రానికి వర్తిస్తుంది. పైకిమాత్రమే రంగురంగులతో బోర్డులు కళగా మెరుస్తున్న ఆరోగ్య కేంద్రంలో లోపల అంతా అనారోగ్యం చుట్టుముట్టింది. దీనికితోడు వైద్యాధికారుల పనితీరు ఒక ఎత్తయితే, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది తీరు మరో ఎత్తుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఎంతగానో కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన ఆసుపత్రి ఒక్కసారిగా విమర్శలకు గురవుతోంది. దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది పనితీరుతో కేంద్రబృందం ఎల్‌క్లోజ్ ద్వారా అవార్డు పొందిన ఆరోగ్య కేంద్రమిది. అయితే నేడు పనిచేస్తున్న వైద్యాధికారుల పనితీరుపై ఫిర్యాదులు పెరిగిపోతున్నాయి. రెండురోజుల క్రితం ఆసుపత్రిలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఓ మండల అధికారిపై జరిగిన యదార్థ సంఘటనే దీనికి ఉదాహరణ. దీనికితోడు గతంలో ప్రతిరోజు 150 నుంచి 200 మంది ఓపి జరిగేది. ప్రస్తుతం వంద నుంచి 120 మందికి పడిపోవడమే ఈ ఆసుపత్రి పని తీరుకు నిదర్శనంగా మారింది. ఆసుపత్రిలో వైద్యులు నిర్లక్ష్యం, రోగుల పట్ల అశ్రద్ధ కారణంగా మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఆసుపత్రి గదుల్లో ఆరేసిన దుస్తులు

# రెవెన్యూలో పనిష్మెంట్ ఎవరికి!

చిత్తూరు, నవంబర్ 27 ప్రభాతవార్త:
రెవెన్యూ శాఖలో పనిష్మెంట్ కింద ఇటీవల జరుగుతున్న బదిలీలు తప్పు చేసిన వారికి వరంగా మారుతుంది. ఇటీవల పెనుమూరు తహసిల్దారు కార్యాలయంలో డిప్యుటీ తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న కిషోర్‌ను కలెక్టర్ హరినారాయణన్ పనిష్మెంట్ కింద యాదమరి మండల డిప్యుటీ తహసిల్దారుగా బదిలీ చేశారు. అలాగే యాదమరి మండల డిప్యుటీ తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న మహేష్ ఏ తప్పు చేయకపోయినా పెనుమూరు తహసిల్దారు కార్యాల యం డిప్యుటీ తహసిల్దారును బదిలీ చేయాల్సి రావడంతో అతని స్థానం లో యాదమరి మండల డిప్యుటీ తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న మహేష్‌ను అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద బదిలీ చేశారు. ఇలా ఒకరు చేసిన తప్పుకు ఒకరి స్థానాలను మరొకరికి బదిలీ చేస్తూ జిల్లా రెవెన్యూ అధికారులు బదిలీలు చేపట్టి పూర్తి చేశారు. ఇది వరకు యాదమరి డిప్యుటీ తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న మహేష్ బంగారు పాళ్యంలో నివాసం వుండటంతో అక్కడి నుండి కార్యాలయ విధులకు సకాలంలో హాజరై విధులు నిర్వర్తించే వారు. పెనుమూరు తహసిల్దారు కార్యాలయంలో ఇది వరకు డిటిగా విధులు నిర్వహిస్తున్న కిషోర్ చిత్తూరు రామ్‌నగర్‌కాలనీ నుండి పెనుమూరు తహసిల్దారు కార్యాల యంకు వెళ్ళి విధులకు హాజరై వచ్చేవారు. ప్రస్తుతం పనిష్మెంట్ కింద జరిగి బదిలీల్లో ఇద్దరి పరిస్థితి తారుమారు అయ్యింది. తప్పు చేసిన పెనుమూరు డిప్యుటీ తహసిల్దారు కిషోర్‌కు మరింత సౌకర్యవంతమైన మండలం లభించింది. చిత్తూరు రామ్‌నగర్ కాలనీ నుండి పది నిముషాల్లో యాదమరి తహసిల్దారు కార్యాలయం చేరుకొని విధులకు హాజరయ్యే అవకాశం లభించింది. ఎలాంటి తప్పు చేయని యాదమరి డిప్యుటీ తహసిల్దారు మహేష్ బంగారుపాళ్యం నుండి యాదమరి తహసిల్దారు కార్యాలయంలో ఇది వరకు విధులు నిర్వర్తిస్తుంటే ప్రస్తుతం మళ్ళీ యాదమరి నుండి బంగారుపాళ్యం అంత దూరం ప్రయాణించి విధులకు హాజరయ్యే పరిస్థితి నెలకొంది. రెవెన్యూలో పనిష్మెంట్ కింద చేపడుతున్న బదిలీల్లో తప్పు చేసిన వారికి మరింత ప్రయోజనం కలుగుతుండగా ఎలాంటి తప్పులు చేయకుండా విధులు సక్రమంగానిర్వహిస్తున్న అధికారులకు కష్టం కలిగిస్తున్నది.

# నేడు రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ నిధుల జమ

చిత్తూరు, నవంబర్ 27 ప్రభాతవార్త:
జిల్లాలోని రైతులకు వైస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 31,777 మంది రైతులకు 8.47 కోట్లు రూపాయల నిధులను సోమవారం తాడేపల్లె సీఎం క్యాంపు కార్యాలయం నుండి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేయనున్నారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలవడానికి లక్ష రూపాయల వరకు పంట రుణాలు తీసుకుని ఏడాడి లోపు తిరిగి చెల్లించినట్లయితే ప్రభుత్వం వడ్డీ రాయితీను అందిస్తోంది. కలెక్టరేట్‌లో సోమవారం సీఎం జగన్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు డిప్యూటీ సీఎం నారాయణ స్వామితో పాటు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె.రోజా, ఎంపీలు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, రెడ్డెప్పలు, కలెక్టర్ హరినారాయణన్, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈకార్యక్రమానికి హాజరు కానున్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణ పథకాన్ని 2019 నుండి అమలులోకి తెచ్చింది. చిన్న, సన్నకారు, కౌలు రైతులు లక్ష రూపాయల వరకు పంట రుణం పొంది సకాలంలో తిరిగి చెల్లిస్తే ఇందుకు సంభందించిన వడ్డీ రాయితీ మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది. ఈపథకం కింద జిల్లాలో 2020-21 సంవత్సరానికి 6,595 మంది రైతులకు 1.70 కోట్లు రూపాయలు ఖరీఫ్ సీజన్‌కు 12,925 మంది రైతులకు 3.48య కోట్లు రూపాయల వడ్డీ రాయితీని ప్రభుత్వం అందించింది. అలాగే 2021 నవంబర్ నెలో భారీ వర్షాల కారణంగా 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోయిన 19,951 మంది రైతులకు 9.06 కోట్లు రూపాయలు పంట నష్ట పరిహారం కింద జిల్లాకు మంజూరు చేశారు. వివిధ కారణాల వల్ల పంట నష్ట పరిహారం జమకాని 1277 మంది రైతులకు సోమవారం సీఎం జగన్ 56.99 లక్షల రూపాయలు ఆ రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయనున్నారు.



# ప్రజా సంక్షేమమే సిఎం లక్ష్యం

## - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల, నవంబర్ 27 ప్రభాతవార్త



ప్రజాసంక్షేమమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని 197శ్రీరామపురం పంచాయతీలో ఆదివారం జరిగిన గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి పథకాలు అందకుంటే వారు మరలా దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి వారికి మంజూరు చేస్తారన్నారు. ఈసందర్భంగా ప్రజలు స్థానిక సమస్యలు ఎమ్మెల్యేకు వివరించగా వాటిని పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, జడ్పీవైస్ ఛైర్మన్ రమ్య, తహశీల్దార్ బాబురాజేం ద్రప్రసాద్, ఎంపిడిఓ ఉపేంద్ర, మండల కన్వీనర్ జనార్ధన్, పిఎసిఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నేతలు శ్రీదేవి, మోహన్, మొగిలిరెడ్డి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం.. చంద్రబాబు ఫోన్‌లో పరామర్శ

రామకుప్పం, నవంబర్ 27 ప్రభశతావార్త



మండలంలోని 89 పెద్దూరుకు చెందిన ఏలుమలై కుటుంబానికి తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాలతో తెదేపా నేతలు 25వేల ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా చంద్రబాబు మృతుడు ఏలుమలై కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, నేతలు ఆంజనేయరెడ్డి, మునస్వామి, విజయ్‌కుమార్‌రెడ్డి, జయశంకర్, కామరాజునాయక్, మనోహర్, సాంబశివం, సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డుప్రమాదాల అడ్డుకట్టకు బ్లాక్‌స్పాట్స్ గుర్తింపు

చిత్తూరు, నవంబర్ 27 ప్రభాతవార్త



చిత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో జాతీయ, రాష్ట్ర రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నియంత్రించేందుకు ఆదివారం చిత్తూరు డిఎస్పీ శ్రీనివాసమూర్తి బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి పరిశీలించారు. చిత్తూరు డిఎస్పీ శ్రీనివాసమూర్తి ఆదివారం తవణంపల్లి, జిడి నెల్లూరు మండలాల పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ బ్లాక్‌స్పాట్‌లను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ బ్లాక్‌స్పాట్‌ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్, బ్యారికేడ్లు, రాత్రిపూట బ్యారికేడ్లు కన్పించేలా వాటిపై రేడియం స్టిక్కర్లు ఏర్పాటుచేస్తామన్నారు. ఇప్పటికే ప్రమాదాలను నివారించడం, రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన కల్పించే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని ట్రాక్టర్లు, ఇతర హెవీ వెహికల్స్ రాత్రిపూట వెనుక వచ్చే వాహనదారులకు స్పష్టంగా కన్పించేందుకు రేడియం స్టిక్కర్లు అంటిస్తున్నామన్నారు.

### లయన్స్‌క్లబ్‌చే క్రీడాసామగ్రి వితరణ

కుప్పంరూరల్, నవంబర్ 27 ప్రభాతవార్త



కుప్పం లయన్స్ క్లబ్ అధ్వర్యంలో ఆదివారం క్రీడాకారులకు క్రీడాసామగ్రిని వితరణగా అందించారు. క్రికెట్, కబడ్డీ పోటీలకు కుప్పం నుంచి యువత ఎంపిక కాగా వారిని ప్రోత్సహించేందుకు లయన్స్‌క్లబ్, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘంచే క్రీడా సామగ్రి అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా॥ మహేష్, వైస్ ప్రెసిడెంట్ సత్యేంద్రశేఖర్, డైరెక్టర్లు శివ, సురేష్, మతీన్, లెనిన్, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నేత శివరాయల్, ప్రవీణ్, వివేక్ పాల్గొన్నారు.

### ఉచిత కంటి ఆపరేషన్లకు 52మంది ఎంపిక

కుప్పంరూరల్, నవంబర్ 27 ప్రభాతవార్త



సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శారద కంటి ఆస్పత్రి అధ్వర్యంలో ఆదివారం కుప్పంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. ఈసందర్భంగా సుమారు 250మందికి కంటి పరీక్షలు నిర్వహించి 52మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అలాగే తిరుపతి సిద్ధ ఆస్పత్రి అధ్వర్యంలో సిద్ధ వైద్య శిబిరం నిర్వహించారు. 300మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు, డా॥ శ్యామరాజు, డా॥ తిలగవతి, డా॥ అరుణాచలం, డా॥ రాజలక్ష్మి, అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### క్రమశిక్షణ..దేశభక్తిగల యువతను తయారు చేయడమే ఎన్‌సిసి లక్ష్యం

- ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య రామకృష్ణ

కుప్పం, నవంబర్ 27 ప్రభాతవార్త



క్రమశిక్షణ, దేశభక్తిగల యువతను తయారు చేయడమే ఎన్‌సిసి లక్ష్యమని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ పేర్కొన్నారు. ఆది వారం వర్సిటీలో ఎన్‌సిసి వేడుకలను నిర్వహించారు. ఎన్‌సిసిలో చేరే పిల్లలు దృఢచిత్తముతో శిక్షణ సాగిస్తుంటారని, సైనిక, నౌక, వైమానిక త్రివిధ దళాల సేవా సంస్థలతో కూడినదే ఎన్‌సిసి అన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య అనురాధ మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థుల సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వర్సిటీలో ఎన్‌సిసి విభాగం ఏర్పాటుకు తనవంతు కృషి చేశానన్నారు. వర్సిటీ తరపున ఆగస్టు 15న ద్రవిడ వర్సిటీ విద్యార్థి ఢిల్లీలో పెరేడ్‌లో పాల్గొనడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి సిటిఓ డా॥ ప్రసాద్ నాయక్, మణివేల్, ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

### అరగొండలో కృష్ణ ఫ్యాన్స్‌చే అన్నదానం

తవణంపల్లె, నవంబర్ 27 ప్రభాతవార్త:



సూపర్‌స్టార్ కృష్ణ దశ దినకర్మ సందర్భంగా అరగొండ, తవణంపల్లె కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. అరగొండ కొత్తబస్టాండులో కృష్ణ నిలువెత్తు చిత్రప టాన్ని వుంచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి సూపర్‌స్టార్ కృష్ణ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ సంఘం నాయకులు టీస్టాల్ బాబు బాయ్, తవణంపల్లె బాలాజీ, మౌల, రంగనాథం, లంబు, పానీపూరి బీరప్ప, గణేష్‌లతో పాటు అభిమానులు పాల్గొన్నారు.

### వాహనాలు బహిరంగ వేలం

గంగవరం, నవంబరు 27, ప్రభాతవార్త :

గంగవరం సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ నేరములలో పట్టుబడిన 19 వాహనాలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 4 ద్విచక్రవాహనాలు,1 కారును,పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ పరిధిలో 5 ద్విచక్రవాహనాలను, బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 ద్విచక్రవాహనాలను,1 ఆటోను ఈ నెల 30న బుధవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### టిడిపి తీర్థం పుచ్చుకున్న వైసిపి నేతలు

పాలసముద్రం, నవంబర్ 27, ప్రభాతవార్త



పాలసముద్రం మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం వెదురుకుప్పం మండల బొమ్మయ్యపల్లి పంచాయితీ, లోటానపల్లి ఆది ఆంధ్రవాడకు చెందిన యువ నాయకులు 15 కుటుంబాలకు సంబంధించిన వైసిపి నేతలు గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం కోఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడు, పాలసముద్రం మండలం తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. యువ నాయకుడు నాగార్జున అతనితో పాటు 15 కుటుంబాలు వైసిపి నేతలకు భీమినేని చిట్టిబాబు నాయుడు కండువా కప్పి తెలుగు దేశం పార్టీకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భీమినేని చిట్టిబాబు నాయుడు మాట్లాడుతూ నాగార్జున వైసిపి పార్టీ నుంచి తెలుగు దేశం పార్టీలోకి రావడం చాలా సంతోషమని ఇక నుంచి 15 మంది కుటుంబసభ్యులకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఐటిడిపి ఉపాధ్యక్షుడు చంద్రబాబు, వెదురుకుప్పం మండల అధ్యక్షుడు లోకనాథం రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహా యాదవ్, మీడియా కోఆర్డినేటర్ కిషన్ చంద్, నియోజకవర్గం యువత ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### హాస్టల్‌లను తనిఖీ చేసిన టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

బంగారుపాళ్యం, నవంబర్ 27 ప్రభాతవార్త:



స్థానిక గవిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు ఆదివారం తనిఖీ చేశారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈహాస్టల్‌ను పరిశీలించారు. ఈ హాస్టల్‌లో 110 మంది విద్యార్థులు కేవలం 5 స్నానపు గదులు మాత్రమే వున్నాయని, హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని గుర్తించారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో శుభ్రత లేని కారణంగా విద్యార్థులు రోగాలకు గురి కావలసి వస్తోందని అన్నారు. అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, వాణిజ్య విభాగ అధ్యక్షుడు వంశీ చౌదరి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# కుప్పం ఏరియా ఆస్పత్రిపై చిన్నచూపు తగదు

## - డిసిసి అధ్యక్షుడు డా॥ బి.ఆర్.సురేష్‌బాబు



కుప్పం, నవంబర్ 27 ప్రభాతవార్త

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న, సాక్షాత్తూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నా నియోజకవర్గమని చెప్పుకునే కుప్పంలోని ఏరియా ఆస్పత్రిపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం దారుణమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రి పేరుకే 150 పడకల ఆస్పత్రి గా అయిందని కనీస సౌకర్యాలు లేక రోగులు అవస్థలు పడుతున్నారన్నారు. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సల నిర వ్వహణకు కీలకమైన అనస్తీషియా వైద్యుడు లేక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. గత ఆర్నెల్లుగా వైద్యుడు లేరన్నారు. కాన్పుల విషయంగా బి గ్రేడ్ ర్యాంకుకు దిగజారిందన్నారు. ఇటీవల రామకుప్ప ంకు చెందిన ఓ మహిళ కుప్పం ఏరియా ఆస్పత్రిలో అనస్తీషియా వైద్యుడు లేకపోవడంతో ప్రాణాలు కోల్పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారని వీరు అధికంగా కుప్పం ఆస్పత్రికి వస్తుంటారన్నారు. పేదల ఆరోగ్య విషయంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి ఏరియా ఆస్పత్రిలో అనస్తీషియా వైద్యుడ్ని నియమించి రోగులకు మెరుగైన వసతులు కల్పించకుంటే తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

### వాకాడులో యధావిధిగా ఆధార్ కేంద్రం ప్రారంభం

వాకాడు, నవంబర్ 27, ప్రభాతవార్త

వాకాడులోని సచివాలయం 2లో సోమవారం నుండి యధావిధిగా ఆధార్ కేంద్రం పున: ప్రారంభమవుతుందని ఎంపిడిఓ గోపినాథ్ తెలిపారు. ఆదివారం ఎంపిడిఓ మాట్లాడుతూ వాకాడు సచివాలయం 2 లో ఉన్న ఆధార్ సెంటర్‌ను ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పలుచోట్ల ఆధార్‌ను ప్రజల కోసం వాడుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఇకనుంచి వాకాడు సచివాలయం 2లోనే ఆధార్ ఉంటుందని సంబంధించిన స్థానిక ప్రజలు ఆధార్ వినియోగించుకోవచ్చని, ప్రజలు ఆధార్‌ను అప్డేట్ చేసుకోవాలని ఆయన కోరారు. మార్పు కూడా చేసుకోవచ్చునని తెలిపారు.

### ఎన్‌సిసి విద్యార్థుల ర్యాలీ

కోట, నవంబర్ 27 ప్రభాతవార్త




విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి అన్నారు. ఎన్‌సిసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆర్ట్స్ కళాశాల నుంచి గాంధీబొమ్మ సెంటరు వరకు ఎన్‌సిసి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణలో నిమగ్నమై ఆర్మీ దుస్తులలో సగర్వంగా పనిచేయాలన్న కోరిక విద్యార్థుల్లో ఉండటం సహజమన్నారు. చదువుకునే వయస్సు నుంచే ట్రైనింగ్‌పై అవగాహన పెంచేందుకు ప్రభుత్వం ఎన్‌సిసిని ప్రోత్సహిస్తుందన్నారు. ఉన్నత విద్య అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ మునయ్య, గాది శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### కర్లపూడి హరిజనవాడలో డ్రైనేజి ఏర్పాటు చేయాలి

కోట, నవంబర్ 27 ప్రభాతవార్త



కోట మండలం కర్లపూడి గ్రామ హరిజనవాడలో డ్రైనేజి సౌకర్యం లేకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కన మురికినీటితో పాటు వర్షపు నీరు కూడా రోడ్డుపై నిల్వ ఉండటంతో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు ముక్కులు మూసుకుంటున్నారని హరిజనవాడ వాసులు విమర్శిస్తున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ రోడ్డుపై మురికినీటిలో దోమలు విపరీతంగా చేరుతున్నాయని, ఎక్కడ మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రబలుతాయోనని భయపడుతున్నారు. మండల అధికారులు ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేసి ఇక్కడ డ్రైనేజి ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు.

# ఆస్తులున్నా ఆదరణకు నోచుకోని వేణుగోపాలస్వామి ఆలయం

## -పట్టించుకోని అధికారులు

వెంకటగిరి. నవంబరు 27 ప్రభాతవార్త



వెంకటగిరి పట్టణం బంగారుపేట వద్ద ఉన్న రుక్మిసమేత సత్యభామ వేణుగోపాల స్వామి ఆలయానికి ఆస్తులు ఉన్నా ఆదరణకు నోచుకోవడంలేదు. 18వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయానికి బాలాయపల్లి మండలం వేణుగోపాలపురం గ్రామం వద్ద దాదాపు 600 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని కొందరు రైతులు సాగు చేసుకుంటున్నారు. వేణుగోపాల స్వామి ఆలయంకు చెందిన భూములు ఉన్న ందున ఇక్కడి గ్రామానికి వేణుగోపాల పురం అని పేరు పెట్టారు. కౌలు రైతులు నామమాత్రంగా భూములకు గుత్త చెల్లిస్తున్నారు. దేవాదాయశాఖ వారి పరిధిలో ఆలయం ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్య దూపదీప నైవేదా ్యలు కూడా స క్రమంగా జరగడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆస్తులు ఉన్నా ఆలయాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. గతంలో వేణుగోపాల స్వామి తిరునాళ్లను రాజాలు ఘనంగా నిర్వహించే వారు. నేడు తిరునాళ్ల కనుమరుగయ్యాయి. ఉన్నతాధికారులైనా చర్యలు తీసుకొని ఆలయాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### శ్యాంప్రసాద్‌రెడ్డిని శాసనమండలికి పంపుదాం

కోట, నవంబర్ 27 ప్రభాతవార్త




తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైసీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి శాసన మండలికి పంపుదామని కోట మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు ఉప్పల ప్రసాద్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చిట్టేడు పంచాయతీలో ఎంఎల్‌సీ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. ఆ మేరకు కరపత్రాలు పంపిణీ చేస్తూ మొదట ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుంటే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఉప్పల శేషయ్య, పుట్టా నారాయణ, కోటేశ్వరరావు, చిరంజీవి, రాయపు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### నేడు రైతులకు రీసర్వే పట్టాల పంపిణీ

తడ, నవంబర్ 27 ప్రభాతవార్త

తడ మండలంలోని గొల్లలమొలువు రైతులకు సోమవారం పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ ఎస్.రామయ్య తెలిపారు. మొదటివిడత భూసర్వేలో భాగంగా గొల్లలమొలువు గ్రామంలో పూర్తిగా రీ సర్వే నిర్వహించామని, అక్కడి రైతులకు పట్టాలు సిద్ధం చేశామని ఆయన చెప్పారు. సోమవారం సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయిలో ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎంపిక చేసిన గ్రామాల రైతులకు పట్టాలను పంచుతున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, రైతులు విరివిగా పాల్గొనాలని తహశీల్దార్ తెలిపారు.

### వెంకన్నపాలెంలో సూపర్‌స్టార్ కృష్ణ సంస్మరణ సభ



కోట, నవంబర్ 27 ప్రభాతవార్త

కోట మండలం వెంకన్నపాలెం గ్రామంలో ఆదివారం సూపర్‌స్టార్ కృష్ణ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకన్నపాలెం సర్పంచ్ కె.మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ కృష్ణ కెరియర్‌లో 1978-86 మధ్యకాలంలో స్వర్ణయుగమని చెప్పారు. 1978లో అన్నదమ్ముల సవాల్, ఏజెంట్ గోపి, ఇంద్రధనస్సు, కుమార్‌రాజా, అల్లరి బుల్లోడు, 1979లో వియ్యాలవారి కయ్యాలు, హేమాహేమీలు, మండేగుండెలు, కొత్తఅల్లుడు, బుర్రిపాలెం బుల్లోడు విజయవంతమైన చిత్రాలుగా నిలిచాయన్నారు. ఘరానాదొంగ, మామాఅల్లుళ్ల సవాల్, చుట్టాలున్నారు జాగ్రత్త, రామ్ రాబర్ట్ రహీం లాంటి చిత్రాలు విజయవంతం అయ్యాయన్నారు. అంతకుముందు 300 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మోపూరు కృష్ణయ్య, వలిపి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### డంపింగ్‌యార్డులో పుట్టిన రోజు వేడుకలు

చిత్తూరు, నవంబర్ 27 ప్రభాతవార్త



చిత్తూరు సంతపేట డంపింగ్ యార్డులో మున్సిపల్ అధికారులు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా తీర్చిదిద్దేందుకు ఆదివారం సంతపేటకు చెందిన ఓ కుటుంబం డంపింగ్ యార్డు ప్రాంగణంలో తమ కుమార్తె పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. డంపింగ్ యార్డు అంటేనే కాలుష్యం, దుర్వాసన, అపరిశుభ్ర తకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. చిత్తూరు మున్సిపల్ అధికారులు సంతపేటలో ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డులో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టారు. డంపింగ్ యార్డులో వ్యర్థాల నిర్వహణ ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తుండడంతో ఎలాంటి అపరిశుభ్రత ఇక్కడ కన్పించదు. ఈ వ్యర్థాలను విండ్రో, వర్మికంపోస్ట్ విధానంలో ఎరువులుగా మార్చడంతో పాటు యార్డులో ఖాళీగా ఉన్న స్థలాన్ని వ్యవసాయానికి అనుగుణంగా మార్చి సేం ద్రీయ విధానంలో పంటలు సాగు చేస్తున్నారు. మొత్తంమీద డంపింగ్‌యార్డును మున్సిపల్ అధికారులు ఆహ్లాదకర రీతిలో తీర్చిదిద్దడంతో ఆదివారం ఇక్కడ నగరానికి చెందిన షర్వన్, ఉమ్మర్‌ల కుమార్తె రియా మొదటి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం , పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

### వైభవంగా జిల్లా స్థాయి రోల్ బాల్ సెలక్షన్స్

తిరుపతి (క్రీడ), నవంబర్ 27, ప్రభాతవార్త



జిల్లాస్థాయి రోల్ బాల్ సెలక్షన్స్ పోటీలు శ్రీనివాస స్పోర్ట్స్ క్రీడా సముదాయంలో నిర్వహించారు. ఈ క్రీడా ఎంపికలకు సుమారు 70 మంది పైగా రోల్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో యు-14, యు-17, యు -19బాల బాలికలను ఎంపిక చేసారు. 12 జిల్లాల రోల్ బాల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబర్‌లో తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ క్రీడా సముదాయం నందు పాల్గొంటున్నారు. ఆదివారం జరిగిన ఎంపికలకు ముఖ్య అతిధులుగా ఏపి రోల్ బాల్ అసోసియేషన్ సెక్రటరి అనిల్ కుమార్ రెడ్డి, ఏపి రోల్ బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి. ప్రతాప్, తిరుపతి జిల్లా చీఫ్ కోచ్ ఉమాశంకర్, యు - 19, ఎస్‌జిఎఫ్ సెక్రటరి జయరామయ్య, యు -14, యు -17 ఎస్‌జిఎఫ్ సెక్రటరీ బాబు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏఓ సయ్యద్, ఏపి టెక్నికల్ బాడీ చైర్మన్ అండ్ కోచ్ విజి ప్రేమనాథ్, పిడిలు శ్రీమన్నారయణ రెడ్డి, పి. శ్రీధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### మధుకుమార్ కర్మక్రియలో పాల్గొన్న భానుప్రకాష్

**పుత్తూరురూరల్, నవంబరు 27 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన సీని యర్ పాత్రికేయుడు పి.మధుకుమార్ కర్మక్రి యలకు నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



# పంచమితీర్థం ఏర్పాట్లను పరిశీలించిన ఈఓ


పంచమితీర్థం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుచానూరు, నవంబర్ 27 ప్రభాతవార్త:

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన 28వ తేదీ సోమవారం జరిగనున్న పంచమితీర్థం ఏర్పాట్లను ఆదివారం టిటిడి ఈఓ ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పంచమితీర్థం నిర్వహణకు అవసరమైన ఇంజనీరింగ్ పనులు పూర్తి చేశామన్నారు. 50 వేలమంది భక్తులు వేచి ఉండేందుకు తొలిసారి జర్మన్ షెడ్లను వివిధ మార్గాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ షెడ్లలో భక్తులకు అన్నప్రసాదం, కాఫీ, టీ అందిస్తామని, అలాగే స్త్రీ పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో ఎటువంటి తోపులాటలు జరగకుండా టిటిడి విజిలెన్స్ సిబ్బంది పోలీసులతో సమన్వయం చేసుకుని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పద్మపుష్కరినిలో ఉదయం 11-40 గంటలకు చక్రస్నానం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. అంతకుముందు ఈఓ, కలెక్టర్, ఎస్పీలు అయ్యప్పస్వామి గుడి వద్ద, జడ్పీ హైస్కూల్, పూడి మార్గంలో ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్లను, క్యూలైన్లను, బ్యారికేడ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జేఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహ కిషోర్, ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖ్‌కుమార్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ-3 సత్యనారాయణ, విద్యుత్ ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఈఈలు మనోహర్, నరసింహమూర్తి, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భక్తులకు రక్షణ కల్పించే బాధ్యత పోలీసులది!

### భక్తులతో ప్రేమగా, సహనంతో ప్రవర్తించండి

### పోలీసులకు జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి సూచన


బందోబస్తు సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి

తిరుచానూరు, నవంబర్ 27 ప్రభాతవార్త:

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఆఖరి రోజైన పంచమితీర్థానికి లక్షలాది మంది భక్తులు వస్తారు కాబట్టి, వారికి రక్షణ కల్పించే బాధ్యత మన పోలీసులదని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి బందోబస్తుకు వచ్చిన పోలీసులకు సూచించారు. ఆదివారం తిరుచానూరులో ఆలయం సమీపంలో వీరికి భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పంచమితీర్థానికి తిరుపతి, పరిసర ప్రాంతాల ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి సైతం భక్తులు విశేషంగా వస్తారు, కావున మనం వారికి సహాయకారిగా ఉండాలని, ఇక్కడ డ్యూటీ చేసేవారు డ్యూటీ అనే భావంతో కాకుండా దేవునికి సేవ చేస్తున్నామనే భావంతో పని చేయాలన్నారు. భక్తుల పట్ల ప్రేమతో, సహనంతో, మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ఈ బ్రహ్మోత్సవాలలో ఒక్క భక్తుడికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకునే బాధ్యత మన జిల్లా పోలీసులపై ఉందన్నారు. మనతో పాటు టిటిడివారు, ఇతర శాఖల అధికారులు కూడా పనిచేస్తూ ఉంటారు కావున వారితో కూడా సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్, ఎల్ అండ్ ఓ, యాస్.బి డిఎస్పీ సురేంద్రరెడ్డి, బందోబస్తు నిమిత్తం వచ్చిన సిబ్బంది పాల్గొన్నారు.

## రెక్కల చప్పుళ్లకు తోడైన జన తాకిడి

### - నేలపట్టులో పర్యాటకుల సందడి


గూడబాతులు


విహంగాలను తిలకిస్తున్న పక్షి ప్రేమికులు

దొరవారిసత్రం, నవంబర్ 27 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో రెక్కల చప్పుళ్లకు జన సందడి తోడైంది. రెండురోజుల నుంచి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో వేలాది మంది పర్యాటకులు, పక్షి ప్రేమికులు వీక్షిస్తు న్నారు. అటు శ్రీహరికోట రాకెట్ ప్రయోగం కోసం వచ్చిన పలువురు తిరుగు ప్రయాణంలో నేలపట్టులో విడిది చేసి ఉన్న విదేశీ విహంగాలు, జింకలు, రామచిలకల గూళ్లను తిలకించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపారు. దీనికితోడు ఇసి కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పలు కృత్రిమ పక్షుల జీవనశైలి, తదితర అంశాలను ఆసక్తిగా తిలకించారు. కుటుంబ సభ్యులతో చిల్డ్రన్స్ పార్కులో సరదాగా గడిపారు. నేలపట్టు పక్షుల కేంద్రంలో గూడబాతులు 1742, తెడ్డుముక్కు కొంగలు 1874, స్టూల్‌బిల్స్ 36, నత్తగుల్ల కొంగలు 1254, లార్జ్ నత్తగుల్ల కొంగలు 440, తెల్ల కంకణాలు 1466 తదితరవి సుమారు మొత్తం 7037 విదేశీ విహంగాలు విడిది చేస్తున్నాయని రేంజర్ వరప్రసాద్ తెలిపారు. పర్యాటకులకు అన్నిరకా లుగా వసతులు కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రేంజర్ వరప్రసాద్ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన గూడబాతు వయస్సు మీరి చిన్నపాటి వ్యాధితో మృతిచెందిందని తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహింపునకు

# కోటి రూపాయలు నిధులు

### జడ్పీ మూడవ స్థాయి సంఘం చైర్మన్, జడ్పీ వైస్ చైర్మన్ నంజయరెడ్డి



చిత్తూరు, నవంబర్ 27 ప్రభాతవార్త:

జిల్లాలో ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహించడానికి జిల్లా పరిషత్ నుండి కోటి రూపాయల నిధులను కేటాయించనున్నట్లు జడ్పీ మూడవస్థాయి సంఘం చైర్మన్, జడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి పేర్కొన్నారు. జడ్పీ చైర్మన్ చాంబర్‌లో ధనంయజరెడ్డి అధ్యక్షతన జడ్పీ మూడవస్థాయి సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి అత్యధిక ప్రధాన్యత నిస్తుందన్నారు. వ్యవసాయ రంగంను లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్, వైఎస్సార్ సున్నీ వడ్డీ రుణాలు, వైఎస్సార్ ఉచిత పంట భీమా, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలను పంపిణీ చేసి రైతులు పంట సాగు చేయడానికి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేయడానిఇ వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసి సమర్పించాలని కోరారు. అలాగే సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలల భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈసమావేశంలో అటవీశాఖ ద్వారా ఔషద మొక్కల పెంపకానికి అవసరమైన నిదులపై చర్చ జరిగింది. ఈసమావేశంలో సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, సిరికల్చర్ జెడీ శోభారాణి, పశుసంవదర్ధకశాఖ జెడీ వెంకట్రావ్, వ్యవసాయ అనుభంద శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్న ప్రముఖులు



తిరుమల, నవంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామివారిని ఆదివారం ఉదయం ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గంగారామ్, రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్‌సింఘాల్ కుటుంబంతో కలసి శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

## క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ




నగరి, నవంబరు 27 ప్రభాతవార్త :

జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా సోమవారం నుంచి స్థానిక కెవికె మైదానంలో జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల పరిధిలోని క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మంత్రి ఆర్.కె.రోజా తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రీడా దుస్తులను సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రం మంత్రి క్యాంప్ కార్యాలయంలో సెట్విన్ సిఇఒ మురళీకృష్ణారెడ్డి, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి క్రీడాకారులకు దుస్తులు అందించారు. క్రీడాకారులకు మంత్రి రోజా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారని, దానిని అందిపుచ్చుకుని క్రీడల్లో బాగా రాణించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని వీరు ఆకాంక్షించారు. నియోజకవర్గ జిల్లా, జోన్ స్థాయిలో పోటీలు ముగిసిన అనంతరం డిసెంబరు 20, 21 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయి విజేతలకు రూ. 50 లక్షల విలువైన బహుమతులు వుంటాయన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ బాలాజీ, కెవికె కోచ్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్‌బాబు, లోకనాథం, మణి, ప్రకాష్, హరి, గోపి, సుమన్, చంద్రు, శివ, ఎస్.ఆర్.మణి తదితరులు పాల్గొన్నారు.

## పెరియవట్టులో దొంగతనం

తడ, నవంబర్ 27 ప్రభాతవార్త

తడ మండలం పెరియవట్టు గ్రామంలో ఏడూరు కుమార్ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో పడుకొని ఉండగా గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి బంగారు ఆభరణాలు చోరీ జరిగింది. ఒక బంగారు సరుడు, ఉంగరం, జత చెవిమాటీలు, రెండు జతల వెండి గొలుసులు, రూ.30 వేల నగదు దొంగతనానికి గురైనట్లు పేర్కొన్నారు. మొత్తం వీటి విలువ రూ.95 వేల దాకా ఉంటుందని ఈ ఫిర్యాదులో తెలిపారు.

## గ్రామీణాభివృద్ధియే లక్ష్యం: రైతు సంక్షేమానికే ప్రాధాన్యం

### రావిళ్ళ వారి కండ్రిగలో ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి రూరల్, నవంబర్ 27 ప్రభాతవార్త

గ్రామీణాభివృద్దేయే లక్ష్యంగా రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఏర్పేడు మండలంలోని రావిళ్ళ వారి కండ్రిగ గ్రామంలో పర్యటించిన ఎంఎల్ఏకు గ్రామస్తులు బ్రహ్మరథం పడుతూ స్వాగతం పలికారు. ఆయన శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను మాధవమాల, సచివాలయం పరిధిలోని గుండ్ల మిట్ట కండ్రిగ, చుండి గ్రామాల్లో నిర్వహించారు. ఏ గ్రామానికి వెళ్ళిన ప్రజలు హారతులిస్తూ స్వాగతం పలుకుతున్నారు. మహిళలు ఉత్సాహంగా ఎంఎల్ఏ పర్యటనకు వస్తున్నారు. శాసనసభ్యుడుబియ్యపు మధుసూదనరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సంబంధించి వాకబు చేస్తున్నారు. పెన్షన్లు, విద్యాదీవెన, రైతు భరోసా పథకాలకు సంబంధించి గ్రామాల వారీగా వివరాలతో జనంతో చర్చిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం అయినా ఇలాంటి పథకాలు అందించారా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి జడ్‌పిటిసి తిరుమలయ్య, ఎంపిపి గీత, వైస్ ఎంపిపి జనార్థన్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, సింగిల్ విండో చైర్మెన్ జనార్థన్ యాదవ్, సర్పంచ్ కె.రాధాకృష్ణ, వైస్ ఎంపిపి అయ్యప్ప, రామమూర్తి, ఎంపిటిసి కృష్ణవేణి, మండలాధ్యక్షుడు గురువారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, నీలకంఠారెడ్డి, మునిరత్నం రెడ్డి, చుండ రామచంద్రారెడ్డి, మునిరత్నం నాయుడు, రవి, గుర్నాధం, జనార్థన్‌యాదవ్, దామోదర్‌రెడ్డి, రమణయ్య యాదవ్, ఎస్ ఎస్‌చంద్ర, బత్తిశెట్టి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## గణనాధునికి వెండి అర్చన పళ్ళెం విరాళం

కాణిపాకం, నవంబర్ 27 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంకు ఆదివారం ఓ భక్తుడు వెండి హారతి పళ్ళెంను విరాళంగా అందజేశారు. ఈమేరకు తెలం గాణా రాష్ట్రం ఖమ్మంకు చెందిన కుమారస్వామి అనే భక్తుడు సుమారు 97 వేల రూపాయలు వెచ్చించి 2,500 కిలోల వెండితో తయారు చేయించిన హారతి పళ్ళెంను విరాళంగా అందజేశారు. దాతలు హారతి పళ్ళెంను కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## వరసిద్ధునికి యజ్ఞోపవీతం బహూకరణ



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారికి ఓ భక్తుడు ఆదివారం వెండి యజ్ఞోపవీతంను విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన రమణాకర్ అనే భక్తుడు సుమారు 46 వేల రూపాయలు వ్యయంతో 750 గ్రాముల వెండితో తయారు చేయించిన యజ్ఞోపవీతంను విరాళంగా అందజేశారు. దాతలు యజ్ఞోపవీతంను కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో అతిధులు



శ్రీకాళహస్తి, నవంబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం నగరి బిసి(ఈడిగ) కార్పొరేషన్ చైర్మన్ కెజె.శాంతికుమారి, మాజీ మున్సిపల్ చైర్మన్ కెజె.కుమార్ దంపతులు విచ్చేశారు. వీరికి ఆలయ దక్షిణగోపురం వద్ద ట్రస్టుబోర్డు చైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించారు. అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా బిసి కార్పొరేషన్ చైర్మన్ శాంతికుమారి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

## మృత్యుంజయస్వామికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, నవంబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామి ఆదివారం ఉదయం విశేష అభిషేకాలు నిర్వహించి పూజలు జరిపి అలంకరణ చేశారు. ఆలయంలో వెలసిన మృత్యుంజయస్వామిపూజల్లో పలువురు భక్తులు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

## సూపర్‌స్టార్ కృష్ణ చిరస్మరణీయుడు



తిరుపతి, నవంబర్ 27ప్రభాతవార్త:

సినీరంగంలో ప్రేక్షకుల ఆదరణ అందుకున్న సూపర్‌స్టార్ కృష్ణ చిరస్మరణీయుడని రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. కృష్ణ జ్ఞాపకార్థం ఆదివారం మధ్యాహ్నం నగరంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు కెఎన్ రాజ, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, ఏవన్ మస్తాన్, కృష్ణ అభిమానులు ఖాదర్‌బాషా, విజయకుమార్‌రెడ్డి, అక్కుబాయి , సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పేదలుక అన్నదానం చేసి నటుడుగా కృష్ణ సేవలనుకొనియాడారు.

# స్మార్ట్‌సిటీలో కంపురోడ్డు!?

### వానొస్తే బురదగుంటే....యాత్రికులు,నగరవాసులు ముక్కుమూసుకోవాల్సిందే

ప్రభాతవార్త-తిరుపతి:

అంతర్జాతీయంగా ఖ్యాతిచెందుతున్న తిరుపతినగరం స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకుంటున్నా, అందంగా తీర్చిదిద్దే అభివృద్ధి మాట ఎలా ఉన్నా ఎంతో ప్రధానమైన ఆర్టీసి బస్టాండుకెళ్ళేరోడ్డు కంపుగా మారింది. వానొస్తే బురదగుంటను తలపిస్తుంది. నిత్యం వేలాది మంది యాత్రికులు, ప్రయాణీకులు, జిల్లా వాసులు, నగరప్రజలు రాకపోకలు సాగించే ముఖ్యరోడ్డు అదీ. ఆర్టీసి బస్టాండు నుంచి పెద్దకాపులేఔట్‌కు చేరుకునే సంధ్యథియేటర్-జయశ్యామ్ థియేటర్ మార్గంలో ఇదీ రోడ్డు దుస్థితి. తిరుపతి పరిసరాల ప్రజలేగాక ఇతర ప్రాంతాలనుంచి తిరుపతికి బస్సుల్లో వచ్చే యాత్రికులు, ప్రయాణీకులు పెద్ద సంఖ్యలో తిరుపతి పెద్దకాపులేఔట్‌కు వస్తుంటారు. ఆర్టీసి, కర్నాటక, తమిళనాడు ఆర్టీసి సిబ్బంది డ్యూటీలు దిగి చిన్నచిన్న టిఫిన్ సెంటర్‌లకు, హోటళ్ళకు ఈ రోడ్డే ప్రధానం, ఇక్కడ అనేకమైన హోటళ్ళు, లాడ్జీలు, విశ్రాంతి గృహాలు నిలయంగా మారడంతో సంధ్యథియేటర్ పక్కరోడ్డు అంత ప్రాధాన్యత ఉంది. లాడ్జీల్లో బసచేసిన యాత్రికులు తిరుమలకు వెళ్ళేందుకు ఈ రోడ్డుపైనే బస్టాండుకు చేరుకోవాల్సి ఉంది. అయితే ఈ రోడ్డు బాగుచేయడం మాత్రం నగరపాలకసంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులకు కనబడదు. ఈ రోడ్డుపై పలు రకాల దుకాణాలు, హోటళ్ళు వ్యాపారాలు ఉన్నాయి. ఈ రోడ్డు అంతంతమాత్రంగానే ఉండటంతో వర్షం వస్తే నీరంతా రోడ్డుపైనే చిన్నపాటి గుంటను తలపింపజేస్తుంది. ప్రయాణీకులు, నగరవాసులు రోడ్డుపై నడవాలంటే ముక్కులు మూసుకోవాల్సిందే. ఈ రోడ్డుపైనే యాత్రికులు మూత్ర విసర్జన చేస్తుండటం, వర్షమొస్తే కలిసిపోయి దుర్వాసన వస్తోంది. అంతకంటే ముందు వర్షపునీరు నిలబడకుండా



నగరపాలకసంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని యాత్రికులు, ఆ ప్రాంతం నగరవాసులు కోరుతున్నారు.